టీడీపీకి ఓటేస్తే బీజేపీకి వేసినట్లే

- మైనార్టీలు అప్రమత్తంగా ఉండాలి
- నాల్గోవార్డు ఎన్నికల ప్రచారంలో అసెంబ్లీ అభ్యర్థి ఎమ్మెల్యే గోపిరెడ్డి


కరపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

నరసరావుపేట: వచ్చే ఎన్నికల్లో టీడీపీకి ఓటేస్తే బీజేపీకి ఓటు వేసినట్లేనని, ముస్లిం మైనార్టీలు అప్రమత్తంగా ఉండాలని అసెంబ్లీ అభ్యర్థి, ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి సూచించారు. శుక్రవారం సాయంత్రం ఎన్నికల ప్రచారంలో భాగంగా నాల్గోవార్డు పనస తోటలో పర్యటించారు. వార్డు ఇన్‌చార్జి షేక్ జానిబాష నాయకత్వంలో నాయకులు, కార్యకర్తలు ఎదురేగి ఘనస్వాగతం పలికారు. తొలుత మహబూబు సుభాని జెండా చెట్టు వద్ద కొబ్బరికాయలు కొట్టి ప్రత్యేక ప్రార్థనలు చేసి ప్రచారం ప్రారంభించారు. ఇంటింటికీ తిరుగుతూ గత ఐదేళ్ల కాలంలో నియోజకవర్గంలో చేసిన అభివృద్ధి, సంక్షేమం గురించిన కరపత్రాన్ని స్థానికులకు అందజేశారు.
డాక్టర్ జహీర్ అబ్బాస్‌ను ప్రత్యేకంగా కలిసి మద్దతు కోరారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ద్వారా లభించిన అమ్మఒడి, చేయూత, ఇళ్లపట్టాలు లాంటి నవరత్నాల ద్వారా అందరూ సంతోషంగా ఉన్నారన్నారు. పొత్తుల తర్వాత 0.68 ఓటింగ్ శాతం తమ పార్టీకి పెరిగిందన్నారు. కేంద్ర హోంశాఖామాత్యులు అమిత్ షా హైదరాబాదులో మాట్లాడుతూ ముస్లింలకు ఉన్న నాలుగుశాతం రిజర్వేషన్ తీసేస్తామ ని ప్రకటించటాన్ని ఖండిస్తున్నామన్నారు. మహానేత వైఎస్సార్ కల్పించిన ఈ రిజర్వేషన్ శాతం వల్ల మైనార్టీల ఆలోచనా విధానం పెరిగి బాగా చదువుకొని ఇంజినీర్లు, డాక్టర్లు అవుతున్నారన్నారు. అందువలన టీడీపీని గెలిపిస్తే బీజేపీని గెలిపించినట్లే అవుతుందని మైనార్టీలు గ్రహించాలని కోరారు.
కార్యక్రమంలో షేక్ కార్పొరేషన్ చైర్మన్ ఆషాబేగం ఖాజావలి, ముదిరాజు, స్వచ్ఛాంధ్ర, మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్లు ఇయం.స్వామి, ఎస్.సుజాతాపాల్, కందుల ఎజ్రా, మాజీ మార్కెట్‌యార్డు చైర్మన్ ఎస్.ఏ.హనీఫ్, రాష్ట్ర మైనార్టీసెల్ ప్రధాన కార్యదర్శి షేక్ ఖాదర్ బాష, జిల్లా మైనార్టీసెల్ ప్రధాన కార్యదర్శి సయ్యద్ ఖాదర్‌బాష, మాజీ కౌన్సిలర్లు షేక్ మంజూరు, షేక్ మస్తాన్‌వలి, నాయకులు లడ్డూబాష, జానిబాష, ఆజ్మల్, షేక్ మహబూబుసుభాని, బొగ్గరం మూర్తి, హోలీవుడ్‌రఘు, సయ్యద్ ఫాతిమా, మల్లెల అనీల, బండి వాసంతి పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీతోనే సంక్షేమం, అభివృద్ధి

- మరోసారి వైఎస్సార్ సీపీని అందరూ గెలిపించాలి
- నాదెండ్లలో ఐదేళ్లలో రూ.55 కోట్ల సంక్షేమ కార్యక్రమాలు
- చిలకలూరిపేట అసెంబ్లీ అభ్యర్థి కావటి మనోహర్‌నాయుడు


నాయకులతో మనోహర్‌నాయుడు

నాదెండ్ల: సంక్షేమం, అభివృద్ధి నిరాటంకంగా కొనసాగేందుకు మరోసారి ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకోవాలని వైఎస్సార్ సీపీ చిలకలూరిపేట అసెంబ్లీ అభ్యర్థి కావటి శివనాగ మనోహర్‌నాయుడు చెప్పారు. శుక్రవారం మండల కేంద్రమైన నాదెండ్ల గ్రామాన్ని ఆయన సందర్శించారు. కార్యకర్తలు, నాయకులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఇటీవల ఆకతాయిల చేతిలో దాడికి గురైన వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా సభ్యుడు షేక్ అల్లాబక్షు ఇంటి వద్దకు వెళ్లి ఆయనను పరామర్శించారు. స్థానికులతో మాట్లాడి సమస్యల గురించి తెలుసుకున్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల అమలు ఫలితాల గురించి ఆరా తీశారు. అనంతరం పార్టీ శ్రేణులతో మాట్లా డుతూ, ప్రజల బలంతోనే మరోసారి వైఎస్సార్ సీపీ అధికారంలోకి రావటం ఖాయమన్నారు. కొందరు దుర్బుద్ధి గల నేతలే స్వప్రయోజనాల కోసం పార్టీని వీడుతున్నారన్నారు. అలాంటి వారితో పార్టీకి ఎలాంటి నష్టం ఉండదని పేర్కొన్నారు. ప్రజలకు మేలు జరిగితేనే తనకు ఓటేయమని ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి ధీమాగా చెప్పటం ఆయన పాలనా తీరుకు నిదర్శనమన్నారు.గత ఐదేళ్ళ కాలంలో ప్రతి ఇంటికీ ప్రభుత్వ సంక్షేమం చేరిందన్నారు. నాదెండ్ల గ్రామంలోని రెండు సచివాలయాలుండగా, ఒకటో సచివాలయంలో రూ.28 కోట్లు, రెండో సచివాలయంలో రూ.27 కోట్లు గత 58 నెలల కాలంలో ప్రజలకు ప్రత్యక్షంగా, పరోక్షంగా మేలు జరిగిందన్నారు. అన్ని వర్గాల ప్రజలు సుఖసంతోషాలతో ఉండేలా ప్రభుత్వ కార్యక్రమాలు పనిచేస్తున్నాయన్నారు. సచివాలయ వ్యవస్థ ద్వారా అవినీతి రహిత సంక్షేమ పాలన, నాడు నేడు ద్వారా విద్య, వైద్య రంగాల్లో కార్పొరేట్ స్థాయి విద్య, వైద్యం అందుబాటులోకి వచ్చిందన్నారు. గత ప్రభుత్వంలో జన్మభూమి కమిటీల పేరుతో రాజకీయ దర్పం చూపటంతో పాటూ అవినీతికి పాల్పడి ప్రజలను ముప్పుతిప్పలు పెట్టారన్నారు. ప్రస్తుత ప్రభుత్వం సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజలకు మెరుగైన సేవలందిస్తూ అవినీతి రహిత పాలన సాగిస్తున్నదన్నారు. కులమత వర్గ రాజకీయ బేధాలు లేకుండా అర్హులైన అందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నా రు. రానున్న ఎన్నికల్లో ఎంపీ అభ్యర్థి అనిల్ కుమార్ యాదవ్‌ను, తనను మంచి మెజార్టీతో గెలిపించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కాట్రగడ్డ మస్తాన్‌రావు, ఎంపీపీ తలతోటి రాణి, మార్కెట్ యార్డు చైర్మన్ గొంటు శ్రీనివాసరెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు మద్దూరి కోటిరెడ్డి, ఎంపీటీసీలు యల్లారావు, యేసమ్మ, అంకమ్మ, నాదెండ్ల, గణపవరం సొసైటీల అధ్యక్షులు మద్దూరి కోటిరెడ్డి, మంగు ఏడుకొండలు, నాయకులు సింగారెడ్డి కోటిరెడ్డి, అల్లడి రవికుమార్, కాట్రగడ్డ రామకృష్ణ, కోనేటి నాగయ్య, మలిపెద్ది శివకామేశ్వరరావు, కంభంపాటి నరసయ్య, కోఆప్షన్ మెంబర్ మూసా, గంగినేని అప్పారావు, చేరెడ్డి వెంకటరెడ్డి, నల్లమోతు హరిబాబు, రాయపాటి చెంచురావు, మిరియాల చినకోటయ్య ఉన్నారు.

జగనన్న పాలనలో సంక్షేమ పథకాల అమలు

యువజన నాయకులు బొల్లా గిరిబాబు


ప్రచారంలో పాల్గొన్న ఎమ్మెల్యే బొల్లా తనయుడు గిరిబాబు

వినుకొండ (నూజెండ్ల): ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలు అమలు కావాలంటే మరలా ముఖ్యమంత్రిగా వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డిని గెలిపించుకోవాలని ఎమ్మెల్యే బొల్లా తనయుడు, వైఎస్సార్ సీపీ యువజన నాయకులు బొల్లా గిరిబాబు పిలుపునిచ్చారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా స్థానిక ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు గెలుపే లక్ష్యంగా పట్టణంలోని 7, 8వ వార్డులలో శుక్రవారం ఆయన విస్తృత ప్రచారం చేశారు. నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు కట్టుబడి ఉన్నారని, 2019 ఎన్నికల సమయంలో ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయడమేకాకుండా, నియోజక వర్గాన్ని మరింత అభివృద్ధి పథంలో తీసుకు వెళ్లేందుకు రానున్న ఎన్నికలలో మరలా బొల్లా బ్రహ్మనాయుడును ఎమ్మెల్యేగా గెలిపించుకోవలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు ముఖ్యమంత్రి సహాయ సహకారాలతో వినుకొండ నియోజకవర్గాన్ని గతంలో ఎన్నడు లేని విధంగా అభివృద్ధి చేశారన్నారు. వినుకొండ తాగునీటి సమస్య పరిష్కారంతోపాటు గిరిప్రదర్శన రోడ్డు, ఎన్ఎస్‌పీ కాలువ కట్ట అభివృద్ధి, ట్రాఫిక్ సమస్యలను పరిష్కరించారని, ప్రజల ఆశీర్వాదం ఉంటే రానున్న రోజులలో ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు వినుకొండను రాష్ట్రంలోనే పేరున్న నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానన్నారు. కార్యక్రమంలో మండల స్థాయి నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఐదు గంటల పాటు నిలిచిన విద్యుత్ సరఫరా

నాదెండ్ల: విద్యుత్ తీగలపై తొండ పడటంతో వైర్లు తెగిపడిన సంఘటన గణపవరం విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద చోటు చేసుకుంది. శుక్రవారం మధ్యాహ్నం 2 గంటల సమయంలో విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలో హెచ్‌టీ తీగలపై తొండ పడింది. దీంతో షార్ట్‌సర్క్యూట్ అయి నాలుగు చోట్ల విద్యుత్ తీగలు తెగిపడ్డాయి. దీంతో గ్రామంలో సుమారు ఐదు గంటలకుపైగా విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. మూడో సచివాలయం పరిధిలో ఒక చోట, గణపవరం, నాదెండ్ల నాలుగు కూడళ్ల వద్ద ఒక చోట కుప్పగంజివాగు పంప్‌హౌస్ వద్ద సబ్ స్టేషన్ సమీపంలో వైర్లు తెగిపడ్డాయి. సిబ్బంది శ్రమించి మరమ్మతులు నిర్వహించి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

నేడు వైఎస్సార్ సీపీ విస్తృత స్థాయి సమావేశం

చిలకలూరిపేట: వైఎస్సార్ సీపీ నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి కావటి శివనాగ మనోహర్ నాయుడు ఆధ్వర్యంలో శనివారం ఉదయం 10గంటలకు నిర్వహిస్తున్నట్లు పార్టీ కార్యాలయ వర్గాలు తెలిపారు. పట్టణంలోని ఎస్ఎంఎస్ గార్డెన్స్ ముస్లిం షాదీఖానాలో నిర్వహించే ఈ సమావేశంలో నరసరావుపేట పార్లమెంటు అభ్యర్థి డాక్టర్ పి.అనిల్‌కుమార్ యాదవ్‌తో పాటు పలువురు ముఖ్య నేతలు పాల్గొంటారని తెలిపారు. ఈ సమావేశానికి నియోజకవర్గ పరిధిలోని ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు.

అగ్నికి ఆహుతైన సుబాబుల్ తోట

శావల్యాపురం: మండలంలోని గంటావారిపాలెం గ్రామంలో సుబాబుల్ తోట అగ్నికి ఆహుతైన సంఘటన శుక్రవారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన కొండలు, చెన్నయ్యలకు చెందిన సుబాబుల్ పొలంలో ప్రమాదవశాత్తు జరిగిన అగ్ని ప్రమాదంలో జరగటంతో సమాచారం తెలుసుకున్న వినుకొండ ఫైర్ అధికారి నాగేశ్వరరావు తన సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపులోకి తీసుకొని వచ్చారు. సత్వరమే స్పందించిన అగ్నిమాపక సిబ్బంది పనితీరుతో పలువురు రైతులు ఊపిరి పీల్చుకున్నారు. ఈప్రమాదంలో రెండున్నర ఎకరాలు సుబాబుల్ తోట అగ్నికి అహుతి అయినట్లు ఫైర్ అధికారులు వెల్లడించారు.

కారు ఢీకొని యువకుడికి తీవ్రగాయాలు



యడ్లపాడు: రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు గాయపడిన ఘటన మండల కేంద్రమైన యడ్లపాడులో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...బాపట్ల జిల్లా విజయలక్ష్మీపురానికి చెందిన కుక్కల శ్రీనివాసరెడ్డి, చార్టెడ్ ఎక్కౌంటెడ్ షేక్ కాలేషాతో కలిసి బుల్లెట్‌పై గుంటూరు నుంచి చిలకలూరిపేట వైపుకు బయలుదేరారు. చిలకలూరిపేట మండలం బొప్పూడి గ్రామానికి చెందిన పూసల పవన్ కుమార్ అదేమార్గంలో కారులో వస్తుండగా ప్రమాదవశాత్తు ముందు వెళ్తున్న బుల్లెట్‌ను ఢీకొంది. యడ్లపాడు ఎన్ఎస్ఎల్ నూలుమిల్లు వద్ద జరిగిన ఈ ప్రమాదంలో బుల్లెట్ పాక్షికంగా దెబ్బతినగా దానిపై ఉన్న శ్రీనివాసరెడ్డికి కాలి మడమవద్ద ఎముక బయటకు వచ్చింది. వెనుక కూర్చున్న కాలేషాకు స్వల్పగాయాలయ్యాయి. ఢీకొన్న కారు నిలుపదల చేయకుండా వెళ్లిపోయాడు. గతంలో యడ్లపాడు స్టేషన్ ఎస్ఐగా పనిచేసి ప్రస్తుతం టంగుటూరులో విధులు నిర్వహిస్తున్న నాగేశ్వరరావు గమనించి కారును వెంబడించి పట్టుకుని తిమ్మాపురం వద్ద కారును నిలుపుదల చేసి పోలీస్‌స్టేషన్‌కు అప్పగించారు.

క్రీస్తు ప్రబోధాలు సర్వదా ఆచరణీయం

- వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కావటి మనోహర్ నాయుడు
- వేర్వేరు ప్రాంతాల్లో గుడ్‌ఫ్రైడే


వినుకొండలో ప్రార్థనలు చేస్తున్న భక్తులు


సిలువయాత్రకు బయలుదేరుతున్న దృశ్యం


టౌన్ బాప్టిస్ట్ చర్చిలో ప్రార్థనల్లో పాల్గొన్న విశ్వాసులు

చిలకలూరిపేట: క్రీస్తు ప్రబోధాలు సర్వదా ఆచరణీయమైనవని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కావటి శివనాగ మనోహర్ నాయుడు చెప్పారు. గుడ్ ఫ్రైడేను పురస్కరించుకొని పట్టణంలోని సంజీవనగర్‌లో ఉన్న సెయింట్ లూథరన్ చర్చిలో ఏర్పాటు చేసిన ప్రత్యేక ప్రార్థనల్లో శుక్రవారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాపులను రక్షించేందుకు ఏసుప్రభువు ప్రాణత్యాగం చేశారని వెల్లడించారు. కార్యక్రమంలో చర్చి పాస్టర్ కొర్రపాటి రాజేష్, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్లు మద్దిరాల విశ్వనాధం, బొల్లెద్దు చిన్నా, వైఎస్సార్ సీపీ నాయకులు కొచ్చెర్ల కిషోర్, కొచ్చెర్ల రాజారత్నం, గుమ్మడి వెంకటేశ్వర్లు, కొణతం మనోజ్, బొందు మస్తాన్‌రావు, మద్దిరాల సాల్మన్, కొణతం మస్తాన్‌రావు, బసల కోటయ్య పాల్గొన్నారు.

నరసరావుపేటలో...

నరసరావుపేట ఈస్ట్: ప్రపంచానికి క్షమా గుణాన్ని అందించిన మహనీయుడు క్రీస్తు ఏసు అని పలువురు సంఘకాపరులు తెలిపారు. పట్టణంలోని క్రైస్తవ ప్రార్థనా మందిరాలలో గుడ్‌ఫ్రైడే సందర్భంగా శుక్రవారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. స్టేషన్ రోడ్డులోని మేరికర్ట్ మెమోరియల్ సెంటినరి టౌన్ బాప్టిస్ట్ చర్చి, చిలకలూరిపేట రోడ్డులోని లూథరన్ చర్చి, హార్డ్ కాంపౌండ్‌లోని మిలీనియం తెలుగు బాప్టిస్ట్ చర్చి తదితర క్రైస్తవ ప్రార్థనా మందిరాలలో ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. క్రీస్తును స్తుతిస్తూ క్రైస్తవ భక్తిగీతాలు ఆలపించారు. ఆయా చర్చిలలో సంఘకాపరులు ఎలీషా మున్నంగి, పి.తిమోతి, క్రైస్తవ పెద్దలు వాక్య పరిచయం నిర్వహించారు.

చిలకలూరిపేటలో...

చిలకలూరిపేటటౌన్: మనుషుల పాపాల కోసం శిలువ మరణం పొందిన రోజును గుడ్ ఫ్రైడేగా పాటిస్తారని పాస్టర్ ఎస్ క్రిస్టర్ చెప్పారు. పట్టణంలోని పురుషోత్తమపట్నం బైపాస్ రోడ్డులో ఉన్న ఏసుక్రీస్తు దివ్యశాంతి నిలయంలో శుక్రవారం గుడ్ ఫ్రై డేను పురస్కరించుకొని ఏర్పాటు చేసిన ప్రత్యేక ప్రార్థనల్లో ఆయన పాల్గొని మాట్లాడుతూ ఏసుక్రీస్తు ప్రపంచ మానవాళికి అందించిన సందేశాలను, ఆయన ప్రవచించిన బోధనలను ప్రతి ఒక్కరూ ఆచరించాలని సూచించారు. మనుషుల పాపాల కోరకు మానవరూపంలో ఉన్న ప్రభువు ప్రాణత్యాగం చేసిన రోజు గుడ్‌ఫ్రై డే అని వివరించారు. పట్టణంలోని పెదనందిపాడు రోడ్డులోని ఆర్‌సీఎం చర్చిలో గుడ్‌ఫ్రైడే సందర్భంగా ఏసుక్రీస్తు శిలువ ఘట్టాలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా పట్టణ వీధుల్లో ర్యాలీ నిర్వహిచారు. పలు ప్రాంతాల్లో పండుగ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

నాదెండ్ల మండలంలో..

నాదెండ్ల: మండలంలోని అన్ని గ్రామాల్లో క్రైస్తవ సోదరులు గుడ్ ఫ్రైడే ఘనంగా నిర్వహించారు. ఆయా చర్చిల్లో పాస్టర్లు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. గుడ్‌ఫ్రైడే విశిష్టతను వివరించారు. తూబాడు పునీత వన చిన్నప్ప దేవాలయంలో క్రీస్తు వేషధారణలో సిలువ ధరించి గ్రామ వీధుల్లో ప్రదర్శించిన కార్యక్రమం ఆకట్టుకుంది. సిలువ వేషధారి కాసు జార్జిరెడ్డి గ్రామంలోని మరియమ్మ విగ్రహం నుంచి చర్చి వరకూ సాగిన సిలువ యాత్రలో పెద్ద సంఖ్యలో క్రైస్తవ భక్తులు పాల్గొన్నారు. ఫాస్టర్ మిల్కిన్‌రాజు ఆధ్వర్యంలో కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. కాసురెడ్డి అందించిన ఆర్థిక సాయంతో అన్నదానం నిర్వహించారు. గణపవరం హెబ్రోను ప్రార్థనా మందిరం, అంబేద్కర్ కాలనీలోని చర్చిలో గుడ్‌ఫ్రైడే సందర్భంగా ఫాస్టర్ ఎడ్లపల్లి రమేష్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ప్రేమ, కరుణ, దయ ఏసుక్రీస్తు బోధించారని చెప్పారు. ఆయన జీవితాన్ని ఆదర్శంగా తీసుకుని ప్రతి ఒక్కరూ సమాజానికి తోడ్పడాలని పేర్కొన్నారు. వివిధ గ్రామాల్లోని చర్చిలకు విద్యుత్ దీపాలంకరణ చేశారు.

సిలువ యాత్ర

యడ్లపాడు: గుడ్‌ఫ్రైడేను పురస్కరించుకుని యడ్లపాడు ఆర్‌సీఎం చర్చి ఆధ్వర్యంలో కల్వరి సిలువ యాత్ర చర్చి ఫాదర్ సుభాష్‌చంద్రబోస్ ఆధ్వర్యంలో కల్వరి సిలువ యాత్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక దిగువ పల్లె (ఎస్సీకాలనీ)లోని ఆర్‌సీఎం చర్చి నుంచి గ్రామ వీధుల నుంచి హైవే సర్వీసు మార్గం మీదుగా ఎర్రకొండ వరకు కల్వరి సిలువయాత్ర కొనసాగింది. 14 దివ్య స్థలాల వద్ద నిలుపుదల చేసి ఆయా స్థలాల ప్రాముఖ్యతను చర్చిఫాదర్ సుభాష్ చంద్రబోస్ వివరించారు. సిలువ యాత్రలో ఏసుక్రీస్తుగా కారుచోల సాద్విక్, మేరిమాతగా కారుచోల మల్లేశ్వరీ, ఎడ్లూరి సంజీవరావు, బందెల మహేష్, బాలతోటి శౌరి, జోజయ్య, విప్పర్ల యోబు నాడు క్రీస్తు పడిన శ్రమలను కళ్లకు కట్టి చూపారు. ఆయా కార్యక్రమాన్ని యానిమేటర్ కె శ్యామ్ పర్యవేక్షించగా యడ్లపాడు, లింగారావుపాలెం, మైదవోలు, జలాది, ఉప్పరపాలెం గ్రామాల నుంచి క్రైస్తవులు భారీగా తరలి వచ్చారు. కార్యక్రమంలో పాల్గొన్న దైవసేవకులు, సంఘపెద్దలు, విశ్వాసులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

వినుకొండలో...

వినుకొండ(నూజెండ్ల): గుడ్‌ఫ్రైడే వేడుకలు వినుకొండ పట్టణం, మండలంలో నిర్వహించారు. పట్టణంలోని ఇమ్మానుయేలు తెలగు బాప్టిస్ట్ చర్చిలో గుడ్‌ఫ్రైడే సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు చేశారు. చర్చి పాస్టర్ ఫిలిప్ దైవ సందేశం వినిపించారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు సామూహిక ప్రార్థనల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో చర్చి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా గుడ్‌ఫ్రైడే వేడుకలు

శావల్యాపురం: మండలంలోని అన్నీ ప్రార్థన మందిరాల్లో గుడ్ ఫ్రైడ్ వేడుకలు క్రైస్తవులు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా స్థానిక విమోచర ప్రార్థన మందిరంలో మతభోధకులు సీహెచ్ యేహేజ్కేలు మాట్లాడుతూ మానవళీ కోసం ఏసుక్రీస్తు శిలువపై మరణించిన రోజును మంచి శుక్రవారం (గుడ్‌ఫ్రైడే) అని అంటారన్నారు. అన్నీ ప్రార్థన మందిరాల్లో ఉదయం 11గంటల నుంచి సాయంత్రం 3గంటల వరకు ప్రత్యేక ప్రార్థనలు పాటు ఉపవాసదీక్షలు నిర్వహించారు. ప్రార్థనలు అనంతరం చల్లటి పానీయాలు పానకం పంపిణీ చేశారు. ఈ కార్యాక్రమంలో విమోచన ప్రార్థన మందిరం నిర్వాహకులు కస్తూరి యేహెజ్కేలు, రాక్‌ప్రశాంత్, నిశాంత్, పద్మనాభుని కోటేశ్వరరావు, సోమేపల్లి వెంకటేశ్వర్లు, బత్తుల గురవయ్య పాల్గొన్నారు.

రొంపిచర్లలో...

రొంపిచర్ల : మండలంలో క్రైస్తవ సోదరులు శుక్రవారం గుడ్ ఫ్రైడే వేడుకలను అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించుకున్నారు. మండల పాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో అన్నవరం, రొంపిచర్ల, వడ్లమూడివారిపాలెం, కొనకంచివారిపాలెం, అలవాల, రామిరెడ్డిపాలెం, సంతగుడిపాడు, విప్పర్ల, వి.రెడ్డిపాలెం తదితర గ్రామాలలో గల తెలుగు బాపిస్ట్ చర్చిలలో, అనుబంధ చర్చిలలో వేడుకలు నిర్వహించారు. కొన్ని గ్రామాలలో ర్యాలీ నిర్వహించి ఏసుక్రీస్తు వేషధారణలతో శిలువ మోయటం కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అనంతరం చర్చిలలో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

బొల్లాపల్లి....

బొల్లాపల్లి: లోక రక్షకుడు ఏసుక్రీస్తును సిలువ వేసిన రోజును గుడ్‌ఫ్రైడ్‌గా క్రైస్తవ సోదరులు జరుపుకుంటారు. మండలంలోని రెడ్డిపాలెం గ్రామం పునీత ఫ్రాన్సిస్ శౌరి వారి దేవాలయ ఫాదర్ తంబి ఆధ్వర్యంలో ఏసు క్రీస్తు సిలువ మార్గం ఊరేగింపు చేశారు. ఈ సందర్భంగా ఫాదర్ తంబి మాట్లాడుతూ పాపాల నుంచి మానవాళిని రక్షించడం కోసం ప్రభువైన ఏసుక్రీస్తు తన ప్రాణాలను అర్పించారని, ప్రతిఒక్కరూ ఆయన చూపిన మార్గంలో పయనించాలని అన్నారు.

ఈపూరులో...

ఈపూరు: గుడ్‌ఫ్రైడే వేడుకలను మండలంలో క్రైస్తవ సోదరులు ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రమైన ఈపూరులోని లూథరన్ చర్చిలో జరిగిన వేడుకల్లో పాస్టర్ జాన్‌మోజేస్ మాట్లాడుతూ ఏసుక్రీస్తు శ్రమల, సిలువ ధ్యానాలను ప్రసంగించారు. ఏసుక్రీస్తు చూపిన శాంతి మార్గంలో ప్రతిఒక్కరూ పయనించి సమాజ శ్రేయస్సు కోసం కృషి చేయాలన్నారు. విశ్వాసులు పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

రజకుల ఆర్థికాభివృద్ధికి వైఎస్సార్ సీపీ కృషి

- పార్టీలో చేరిన 40 రజక కుటుంబాలు
- కండువాలను కప్పి పార్టీలోకి ఆహ్వానించిన అసెంబ్లీ అభ్యర్థి డాక్టర్ గోపిరెడ్డి


పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి, రాజకీయ పరిశీలకులు గులాబ్‌రసూల్

నరసరావుపేట: స్థానిక 33వ వార్డు బరంపేట చాకిరాలమెట్టుకు చెందిన 40 రజక కుటుంబాలు వైఎస్సార్ సీపీలో చేరడం చాలా సంతోషకరమైన విషయమని ఎమ్మెల్యే, అసెంబ్లీ అభ్యర్థి డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస రెడ్డి పేర్కొన్నారు. గురువారం రాత్రి వార్డులో నిర్వహించిన కార్యక్రమంలో పార్టీలో చేరిన వారికి కండువాలను కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో రజకులు బలమైన పోరాట పటిమ ప్రదర్శించి పార్టీని అధికారంలోకి తీసుకురావాలని కోరారు. ఈ వార్డులో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అందరికీ అందుతున్నాయన్నారు.
సంక్షేమ ఫలాలు దక్కని వారికి పార్టీ తిరిగి అధికారంలోకి వచ్చిన వెంటనే అమలు చేస్తా మని హామీ ఇచ్చారు. తనతో పాటు పార్లమెంటుకు పోటీచేస్తున్న అభ్యర్థి డాక్టర్ అనిల్‌కుమార్ యాదవ్ అభ్యర్థిత్వాన్ని కూడా బలపరిచి ఆయన విజయానికి రజకులు కృషిచేయాలని కోరారు. మళ్లీ పార్టీ గెలిస్తేనే అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలన్నీ అందుతాయనేది గుర్తుంచుకోవాలన్నారు. ప్రతి కుటుంబం ఆర్థికాభివృద్ధి సాధించాలంటే ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కావాలన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ రాజకీయ పరిశీలకులు గులాబ్ రసూల్, నాయకులు మోటుపల్లి అంజి, నిడమానూరి సురేంద్రబాబు, కంచర్ల హనుమంతరావు, బాజి పాల్గొన్నారు.

రవ్వవరంలో ఐదుగురు...

వినుకొండ(నూజెండ్ల): స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయం లో నూజెండ్ల మండలం రవ్వారం గ్రామానికి చెందిన 5 కుటుంబాలు ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు సమక్షంలో వైఎస్సార్ సీపీలోకి చేరారు. ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొల్లా మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో జరిగిన అభివృద్ధిని చూసి అనేకమంది పార్టీలో చేరుతున్నారన్నారు.
పార్టీలో చేరిన వారందరినీ వైఎస్సార్ సీపీ కుటుంబ సభ్యులుగా చూస్తామని, రానున్న రోజుల్లో పార్టీలో సముచిత స్థానం కల్పిస్తాని హామీ ఇచ్చారు. రాష్ట్రం సుభిక్షంగా ఉండాలంటే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరలా ముఖ్యమంత్రి కావాలన్నారు. కార్యక్రమాల్లో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పేరూరుపాడులో పలు కుటుంబాలు చేరిక


పార్టీలో చేరిన వారికి కండువా కప్పి సాదరంగా ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

బొల్లాపల్లి : మండలంలోని పేరూరుపాడు గ్రామం నుంచి తెలుగుదేశం పార్టీకి చెందిన పలు కుటుంబాలు వైఎస్సార్ సీపీలో చేరాయి. ఇటీవల మండలం నుంచి పలు కుటుంబాలు వైఎస్సార్ సీపీకి ఆకర్షితులై వరుస చేరికలు జరుగుతున్నాయి. గ్రామం నుంచి సుమారు 25 కుటుంబాలు పార్టీలో చేరాయి. వారికి నరసరావుపేట పార్లమెంటు అభ్యర్థి పి.అనిల్‌కుమార్ యాదవ్, వినుకొండ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి బొల్లా బ్రహ్మనాయుడు హాజరై పార్టీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేదల అభ్యున్నతికి వైఎస్సార్ సీపీ పాటుపడిందని, జగనన్న ప్రవేశపెట్టిన నవరత్న పథకాలు ఆర్థిక ఎదుగుదలకు దోహదపడ్డాయని, రాబోయే కాలంలో మళ్లీ అధికారంలోకి వస్తే ఇంకా పురోగతి సాధించే అవకాశం ఉందని, దీంతో వైఎస్సార్ సీపీలోకి వచ్చామన్నారు. అనంతరం ఎంపీ అభ్యర్థి అనిల్‌కుమార్ యాదవ్ మాట్లాడుతూ జగనన్న ఆదేశానుసారం నెల్లూరు నుంచి నరసరావుపేట బరిలో దిగానని, మీ బిడ్డలాగా ఆశీర్వదించాలని కోరారు. ఇక్కడి నుంచి పార్లమెంటుకు దిగ్గజాలు గెలుపొందారని గుర్తు చేశారు. మీరు నన్ను గెలిపిస్తే ఈ ప్రాంత అభివృద్ధికి కృషి చేసి చేస్తానని హామీ ఇచ్చారు. బొల్లా బ్రహ్మనాయుడు మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మంచి చేయడం వల్లనే ఆకర్షితులై పార్టీలోకి చేరికలు పెరిగాయన్నారు. పార్టీలో చేరిన ప్రతిఒక్కరినీ వైఎస్సార్ కుటుంబంలా ఆదరిస్తామన్నారు. పేరుపేరున ధన్యవాదాలు తెలిపారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని, జగనన్న హయాంలో చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి పథకాలు ప్రతిఒక్కరికీ అందాయని, పార్టీలకతీతంగా మేలు జరిగిందని గుర్తు చేశారు. కూటమి గెలిస్తే సంక్షేమం ఉండదని, చంద్రబాబు హయాంలో 600 పథకాలు ఇచ్చి ఏ పథకం అమలు చేయలేదని, ఇది ప్రతిఒక్కరూ గుర్తించాల్సిన అవసరం ఉందన్నారు. అదే వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తే సంక్షేమం అమలు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో నియోజకవర్గ, మండల స్థాయి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

స్వాతంత్ర్యం కోసం పోరాడిన సాయుధులు


మాట్లాడుతున్న వై.వెంకటేశ్వరరావు

నరసరావుపేట:భారతదేశ స్వాతంత్రం కోసం సాయుధ పోరాట మార్గాన్ని ఎంచుకొని చివరి వరకు ఎలాంటి లొంగుబాటు లేకుండా ఉరికంబాన్ని ముద్దాడిన భరతమాత ముద్దు బిడ్డలు భగత్‌సింగ్, రాజగురు, సుఖదేవులని పీడీఎం నాయకులు వై.వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. స్థానిక సీపీఎం పార్టీ కార్యాలయంలో శుక్రవారం పీడీఎం ఆధ్వర్యంలో భగత్‌సింగ్, రాజగురు, సుఖదేవుల 93వ సంస్మరణ ముగింపుసభను నిర్వహించారు. దీనికి జిల్లా కార్యదర్శి జి.రామకృష్ణ అధ్యక్షత వహించారు. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ వారి స్ఫూర్తితో నిజమైన స్వేచ్ఛ స్వాతంత్రం సమానత్వం కోసం మరో స్వతంత్ర పోరాటాన్ని కొనసాగించాలని పిలుపునిచ్చారు. పీడీఎం నాయకులు షేక్ మస్తాన్‌వలి, నల్లపాటి రామారావు, కేఎన్‌పీఎస్ రాష్ట్ర కార్యదర్శి కె.కృష్ణ, భారత బచావో జిల్లా అధ్యక్షులు వి.కోటనాయక్, పీకేఎస్ జిల్లా కమిటీ సభ్యులు కంబాల ఏడుకొండలు, సీఐటీయూ నాయకులు షేక్ సిలార్, ఆవాజ్ నాయకులు హుస్సేన్, ఎంసీపీఐ జిల్లా కార్యదర్శి షేక్ రెడ్ బాష, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు లక్ష్మీశ్వర రెడ్డి పాల్గొని ప్రసంగించారు.

వడ్డీ రాయితీతో పన్ను చెల్లించేందుకు రెండురోజులే వ్యవధి

- పన్నులు చెల్లించి పురపాలక సంఘానికి సహకరించండి
- ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు


మొబైల్ వాహనం వద్ద పన్ను చెల్లించిన వ్యక్తికి రసీదు అందజేస్తున్న మున్సిపల్ కమిషనరు

నరసరావుపేట:ఈ ఆర్థిక ఏడాదికి పన్ను బకాయి ఉన్న వారందరూ ప్రభుత్వం కల్పించిన వడ్డీ రాయితీతో చెల్లించి పురపాలక సంఘానికి సహకరించాలని మున్సిపల్ కమిషనర్ సి.రవిచంద్రారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం రూ.3.5 లక్షల పన్ను చెల్లించిన యజమానికి మొబైల్ వాహనంవద్ద రసీదు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లా డుతూ బకాయిలు ఉన్నవారు పట్టణంలో చాలామంది ఉన్నారని, వారందరూ వచ్చే రెండు రోజుల వ్యవధిలో చెల్లించి వడ్డీ రాయితీ పొందాలని సూచించారు. పన్ను చెల్లించేందుకు మున్సిపల్ కార్యాలయంలోని ప్రత్యేక కౌంటర్ల వద్ద, పట్టణంలో సంచరించే మొబైల్ వాహనంవద్ద కూడా చెల్లించవచ్చన్నారు. 31వ తేదీ ఆదివారం అయినప్పటికీ పురపాలక సంఘంలోని ప్రత్యేక కౌంటర్లు, మొబైల్ వాహన కౌంటర్లు పనిచేస్తాయన్నారు. కావున ప్రతి ఒక్కరు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

అక్రమ మద్యం కేసులో నిందితుడి అరెస్ట్

నరసరావుపేట టౌన్: అక్రమ మద్యం కేసులో నిందితుడ్ని అరెస్ట్ చేసి అతని వద్ద నుంచి 10 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సీఐ నయనతార శుక్రవారం తెలిపారు. కోటప్పకొండ వద్ద అక్రమంగా మద్యం విక్రయిస్తున్నారన్నా సమాచారం మేరకు దాడులు నిర్వహించామన్నారు.